# ముంగిట్లో గొబ్బెమ్మలు

సంక్రాంతి నెలపట్టారు. చలిచలిగా ఉంది. రాత్రి ఏడు కాకుండానే ఊరంతా చిమ్మచీకటిగా ఉంది.

"ప్రయాణంలో ఈ డ్రస్సు వేసుకున్నావు! కాని ఈ వూళ్ళో చీరకట్టుకోవాలి. ఇక్కడ అందరు చీరలే కట్టుకుంటారు" మరోసారి భార్యకు జ్ఞాపకం చేసాడు శ్రీకాంత్.

"సరే! అన్నాగా! ఎన్నిసార్లు చెబుతావు?" విసుక్కుంది రమ్య.

శ్రీకాంత్ పెళ్ళయిన తరువాత భార్యతో మొదటిసారిగా ఆ వూరు వచ్చాడు. ఇంట్లో అడుగు పెడుతుంటే "ఆగు! ఆగు!" అంటూ గడప దగ్గరే బంధువులు ఆపేసారు. పిన తల్లి దిష్టిపళ్ళెంతో వచ్చి దిష్టి తియ్యబోయింది -

"ఈ నమ్మకాలు నాకు లేవు, మీ అబ్బాయికి తీసుకోండి" ఆమెను తోసుకుంటు గడపదాటి లోపలికి విసురుగా వచ్చేసింది రమ్య.

భార్య ప్రవర్తన శ్రీకాంత్‌కు బాధ కలిగించింది. అంతమందిలో ఏమీ అనలేకపోయాడు. కొత్త కోడల్ని చూడాలని ఇరుగు పొరుగులు బంధువులు అందరు అక్కడే ఉన్నారు.

మోకాళ్ళ వరకు మిడ్డీవేసుకుని, ఎత్తు బూట్లతో లోపలకు వచ్చిన రమ్యను అందరు గుడ్లార్పకుండా చూసారు. అందులో ఆమె మాటలు వారికి మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. వారి చూపులు పసికట్టిన శ్రీకాంత్‌కి వళ్లంతా తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది. రమ్య అవేమి పట్టించుకోలేదు. వారినందరిని వింత జంతువులను చూసినట్లు చూసింది.

"శ్రీ! ఇటు చూడవేం? నారూమెక్కడ?" అంది గట్టిగా.

ఆ మాటలు విన్న శ్రీకాంత్‌కి కాసేపు ఏం చెయ్యాలో తోచలేదు. తర్వాత కర్తవ్యం గుర్తుకొచ్చింది.

"రమ్యా! ఇటురా!" అంటూ ఆమె చెయ్యిపట్టుకుని ఎప్పుడూ తను ఉండే గదివైపు నడిచాడు.

"అలా చూస్తారేం? నేను వింత జంతువుననుకున్నారా?" భుజానికున్న బ్యాగ్‌తో శ్రీకాంత్ వెంట అడుగులేసింది రమ్య! ఆ మాటలు విన్న శ్రీకాంత్ మనస్సు చివుక్కుమంది.

"కొత్తకోడలుగారికి మన చూపులే నచ్చలేదుట? ఇంక ఇక్కడెందుకే? ఇళ్ళకు నడవండి" అంటూ చూడ్డానికి వచ్చిన వాళ్ళంతా వెనుదిరిగారు. వారిని ఉండమని అనలేని శ్రీకాంత్ తల్లి, చెల్లెలు వారివైపు జాలిగా చూసారు.

గదిలోకి వెళ్ళగానే శ్రీకాంత్ భార్యను కాస్త మందలించాడు. "రమ్యా! నీ ప్రవర్తనేమి బాగాలేదు. హారతి నీకు నచ్చలేదు! కాని అంత మొరటుగానా సమాధానం చెప్పడం? వాళ్ళేమనుకుంటారోనని ఆలోచించవేమి? నీ ధోరణి నీదేనా?" అన్నాడు కోపం తగ్గించుకుని కంఠంలో లేని మార్దవం తెచ్చుకున్నాడు.

"నా ప్రవర్తన మార్చుకోలేను? వాళ్ళేమనుకుంటే నాకేం?"అంది మరింత పెంకిగా.

"ఇక్కడలా ప్రవర్తించి అందరి మనస్సులు నొప్పించకు. మనముండేది నాలుగు రోజులే, ఈ నాలుగు రోజులు కాస్త ఓర్పు తెచ్చుకో!" అన్నాడు. బతిమాలే ధోరణిలో.

"సరే! అంది విసుక్కుంటూ రమ్య- రెండు చేతులు గుండెల మీద వేసుకుని ఊపిరి పీల్చుకున్నాడు శ్రీకాంత్.

మరునాడు ఉదయం 8 గం॥ అయింది. రమ్య నిద్రలేవలేదు. శ్రీకాంత్ అందరితో కాఫీ తాగుతున్నాడు.

"అబ్బాయి! కోడలికి వంట్లో బాగుండలేదా ఏమీ? ఇంకా నిద్ర లేవలేదేమిరా?" అడిగింది తల్లి.

"రోజూ 9 గం॥ లకే లేస్తుంది" శ్రీకాంత్ ఆ మాటలు పైకి అనలేక నోట్లోనే గొణుక్కున్నాడు.

"ఏం లేదమ్మా! నిన్నటి ప్రయాణం అలసట అంతే!" అన్నాడు ఓ వెర్రి నవ్వు తెచ్చుకుని.

ఇంక అక్కడ ఉండలేక గదిలోకి వెళ్ళి రమ్యను నిద్రలేపాడు.

"కాఫీ! కాఫీ! అబ్బా! కాఫీ! కాఫీ!" అంటు రమ్య కళ్ళు తెరచింది.

"ఇక్కడ బెడ్ కాఫీలుండవు? వెళ్ళి ముఖం కడుక్కుని కాఫీతాగు" అన్నాడు.

రమ్య సమాధానం చెప్పకుండానే వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది. నీరజ కాఫీ పట్టుకొచ్చి ఇచ్చింది.

"ఈ కప్పు ఇంత డర్టీగా ఉందేం?" అంటూనే కప్పు అందుకుంది. కాఫీ తాగేసి తిరిగి కప్పు నీరజకి అందించింది.

"నువ్వెళ్ళి అక్కడ పెట్టిరావచ్చుగా! దాని చేతికి అందిస్తావేం?"

ఏం కాఫీ కప్పు అందిస్తే మీ చెల్లెలు అరిగిపోతుందా?" అంటూ తిరిగి ప్రశ్నించింది.

శ్రీకాంత్ సమాధానం చెప్పలేదు.

"ఏం వూళ్ళో! బాతురూమే సరిగా లేదు ఎలా స్నానం చేస్తారో ఏమో?" అంటూ విసుక్కుంది.

"ఈ రోజైనా చీరకట్టుకో! ఆ మిడ్డీ మాత్రం వేసుకోకు!" అంటూనే శ్రీకాంత్ గదిలోంచి బయటకు వచ్చేసాడు. ఇంకా అక్కడే ఉంటే ఏమంటుందోనని అతనికి భయం పట్టుకుంది.

రమ్య చికాగ్గా స్నానం చేసి వచ్చింది. రెండుసార్లు చీరవిప్పి కుచ్చిళ్ళు పెట్టుకుంది. కాని కుచ్చిళ్ళు సరిగా రాలేదు. చీర పక్కన పడేసి పంజాబీ డ్రస్సు వేసుకుని హాల్లోకి వచ్చింది.

"చీరకట్టుకోలేదేం?" భార్యను మెల్లిగా గొంతు తగ్గించి అడిగాడు.

"నాకు చేతకాలేదు" మొండిగా సమాధానమిచ్చింది రమ్య.

"నీరజా! మీ వదినకు కాస్త చీరకట్టుకోడం నేర్పవే?" అన్నాడు శ్రీకాంత్.

"ఏం ఒదినా! నీకు చీర నేకట్టనా?" నీరజ నవ్వుతూ అడిగింది.

"నే చీర కట్టుకోను. నీకు సరదాగా ఉంటే ఆ లంగా ఓణీ మానేసి నువ్వు చీర కట్టుకో? కాస్త అందంగా కనపబడతావు".

రమ్యమాటకి నీరజ మనస్సు చివుక్కుమంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

రమ్య విసవిస నడుచుకుంటూ గదిలోకి వెళ్ళింది. వచ్చిన కోపం దాచుకుంటూ ఆమె వెంటే వెళ్ళాడు శ్రీకాంత్.

"అసలు ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుసా? కాస్త మర్యాదగా చెప్పవచ్చుగా! అంత సూటిగా చెప్పాలా? నీ వల్ల వాళ్ళ మనస్సు ఎంత కష్టపడుతుందో తెలుసా?"

"నాకవసరం లేదు. వాళ్ళేమనుకుంటే నాకేం?"

"అది నా చెల్లెలు, వాళ్ళంతా నావాళ్ళు" వాళ్ళనవమానిస్తే నన్ను అవమానించి నట్టే? నీ కిక్కడ మర్యాదగా ఉండడం చేతకకాపోతే రేపే వెళ్ళిపో!"

రమ్య కోపం ఆకాశం అంటింది."అయితేసరే! వీలుంటే ఈవేళే పంపించే సెయ్యి!'' అంది మరింత పంతంగా. తాను అరవడం ఇష్టంలేక బయటికి వెళ్ళిపోయాడు శ్రీకాంత్.

"ఛీ! ఛీ! అడవి మనుషులు! ఇక్కడికి రావడం నాదే తప్పు" పదే పదే అనుకుంది రమ్య.

ఎం.బి.ఎ. చదివిన శ్రీకాంత్ బొంబాయిలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనుంటున్న పక్క ప్లాటులోనే రమ్య వాళ్ళు ఉంటున్నారు. రమ్య అందంగా ఉంటుంది. శ్రీకాంత్‌తో పరిచయమయింది. అది ప్రేమగా మారింది. బి.ఎస్.సి. చదువుతున్న రమ్య చదువు మానేసింది. అతనిని వదలి ఒక్క క్షణం ఉండలేకపోయింది. తండ్రిలేని శ్రీకాంత్ తల్లిని, చెల్లిని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. తండ్రి పోయాక తల్లి, చెల్లెలు తాతగారి ఇంట్లో ఆ పల్లెలోనే ఉంటున్నారు. ఆ ప్రేమ మత్తులో శ్రీకాంత్ కూడా ఇంట్లో వాళ్ళకు చెప్పకుండా రమ్యను పెళ్ళి చేసుకోడానికి అంగీకరించాడు. రమ్య తల్లిదండ్రులు వారి పెళ్ళి జరిపించి బాధ్యత తీరిందనుకున్నారు. తరువాత తల్లికి ఫోనులో చెప్పాడు. తెలియగానే తల్లి, తాత, అమ్మమ్మ చాలా బాధపడ్డారు. తర్వాత సర్దుకున్నారు.

"ఒక్కసారి కోడల్ని తీసుకురా రా! పెళ్ళి చూడలేదు. కోడల్ని చూసి సంతోషిస్తా" అంది తల్లి.

పెళ్ళయిన తరువాతే రమ్య స్వభావం బయటపడింది. చదువు మానేసింది. వంటరాదు. పైగా మాట దురుసు. ముస్తాబై ఎక్కడికైనా వెళ్ళడమే ఆమెకిష్టం. శ్రీకాంత్ మనసులో చాలా బాధపడుతున్నాడు. కాని ఆమెను మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. తన పల్లె సంగతులు చెప్పి మరీ తీసుకొచ్చాడు. ఖరీదైన బట్టలతో మోడరన్‌గా ఉన్న వారినే ఆమె పలకరిస్తుంది. లేని వారిని అవమానిస్తుంది. ఆమె పెరిగిన వాతావరణం అటువంటిదని ఆమెలో మార్పు రావాలని కోరుకుంటున్నాడు శ్రీకాంత్. కాని ఆమెలో అంత మొండితనం, దురుసుతనం ఉందని ఊహించుకోలేక పోయాడు శ్రీకాంత్.

వీధి ముంగిళ్ళలో పెట్టుకున్న గొబ్బెమ్మలను ఒకరిలో ఒకరు నీరజవాళ్ళు చూసుకుంటున్నారు. అందరు నీరజ పెట్టిన గొబ్బెమ్మలే బాగున్నాయన్నారు.

విసవిసా కోపంతో గదిలోంచి బయటకు వచ్చింది రమ్య. నీరజావాళ్ళు అక్కడున్నారని వీథుల్లోకి వచ్చి నిలబడింది.

తెల్లని చుక్కల ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలు కొలువు తీరాయి. ఆ అందాన్ని చూసి ఆనందించే మనస్సు రమ్యకు లేదు.

"ఇంటిముందు ఆ మట్టి ముద్దలేమిటి?" అంది రమ్య విసుగ్గా!

"అవి మట్టి ముద్దలు కావు! ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు. సంక్రాంతి నెలపట్టింది మొదలు ఈ గొబ్బెమ్మలు పెట్టి పూజిస్తాం...

పసుపు, కుంకుమ పిండితో బొట్లు పెడతాం. బంతిపూలు గుచ్చుతాం! సమాధానమిచ్చింది నీరజ.

"అందరికంటే నీరజ గొబ్బెమ్మలే ఎంత బాగున్నాయో చూడండీ!"

"ఛీ! ఛీ! పేడ ముద్దలా! కంపు కంపు!" అంటూ ముక్కుమూసుకుంది.

"అవి వాసన వెయ్యవు. సాయంకాలానికి ఎండలో ఎండిపోతాయి. వాటిని గొబ్బి పిడకలుగా వేస్తాం. భోగి పండుగ రోజున భోగిమంటలు వేసి కొత్త బియ్యంతో పరమాన్నం వండుతాం". పక్కింటి వాణి గబగబ సమాధానం చెప్పేసింది.

"పిడుకలే వేస్తారో, మంటలే పెడతారో నాకెందుకు? అయినా ఆ పేడ ముద్దలకి పూజలొకటా! ఆ పసుపు కుంకుమలు పెట్టి ఆ బంతిపూలు గుచ్చడమేమిటి? అయినా ఎంత పూజ చేసినా పేడ ముద్ద దేవతవుతుందా?" అంది రమ్య వెటకారంగా.

వాణి ముఖంలో ఒక్కసారి కళ తప్పినట్లయింది. అక్కడ నుంచి గబగబా వెళ్ళిపోయింది. నీరజతోపాటు మిగిలిన పిల్లలకి ఏం చెయ్యడానికి తోచలేదు. అలాగే నిలబడి చూస్తున్నారు.

రమ్య మెట్లు దిగి గొబ్బెమ్మల వరకు వచ్చింది. ఎత్తు చెప్పుల పాదంతో గొబ్బెమ్మలను దాటబోయింది. ముందు పాదం ఎత్తి ముందుకు వేసింది.

"అదేమిటి వదినా! అలా గొబ్బెమ్మలు దాటి వెళ్ళకూడదు?" అంది నీరజ.

"పక్కనుంచి వెళ్ళవచ్చు కదండీ!" అంది వెంకటలక్ష్మి.

"దాటితే ఏమవుతుంది? అన్నింటికి మూఢనమ్మకాలేనా?" అంటూనే రమ్య రెండవ ఎత్తు చెప్పుల పాదం ఎత్తింది. గొబ్బెమ్మల మీదుగా ముందుకు వెయ్యాలనుకుంది. అంతే ఆ పాదం గొబ్బెమ్మల మీద పడి జారింది. ఇంకేముంది. మనిషి బోర్లా పడుతూ 'అమ్మో!' అంటూ అరిచింది. అదో ఆర్తనాదం. అక్కడి వారంతా

చూస్తూ అలాగే నిలబడిపోయారు. ఆమె బాధతో మెలికలు తిరుగుతోంది. లేవడం ఆమె తరం కాలేదు.

"వదినా! అంటూ నీరజ ముందు ఆమె దగ్గరగా వెళ్ళింది. అక్కడివారంతా ఆమెను లేవదీయడానికి ఎంతో ప్రయత్నించారు. వాళ్ళ తరం కాలేదు.

"అన్నయ్యా! వదిన పడిపోయింది" నీరజ గట్టిగా అరిచింది. ఆ కేకలు విని శ్రీకాంత్‌తోపాటు పాలేరు వీరన్న పరుగెత్తుకొచ్చారు.

"అయ్యయ్యో! రమ్యా! ఇలా పడిపోయావేమిటి?" అంటూ శ్రీకాంత్ ఆమెను లేవదీయడానికి ప్రయత్నించాడు.

"వీరన్న ఓ చెయ్యి వెయ్యి" శ్రీకాంత్ మాటలు వినగానే వీరన్న అందరు కలిసి ఆమెను లేవనెత్తారు. గదిలోకి సాయంపట్టి మంచం మీద పడుకోపెట్టారు.

"అమ్మా! అయ్యో!" అంటూ కాలు పట్టుకుని ఏడుపు మొదలుపెట్టింది రమ్య. ఆమె బట్టలనిండా పేడ పట్టుకుంది.

"అబ్బా! కంపు! కంపు! ఆ గొబ్బెమ్మల పేడ అంతా పసుపు కుంకుమలతో పాటు బట్టల మీదే ఉంది. చూడు! చూడు!" అన్నాడు శ్రీకాంత్.

"కాలు నొప్పిగా ఉందేమో! ముందు డాక్టర్ని పిలవరా!" అంది శ్రీకాంత్ తల్లి.

"నే బట్టలు మారుస్తా! వదినా!" అంటూ నీరజ వదినగారి దగ్గరగా వెళ్ళింది. అక్కడి మగవారు బయటకు వెళ్ళారు.

నీరజ, వాణి కలిసి రమ్యను కూర్చోపెట్టి బట్టలు మార్చారు. వారు ఒక్క మాట రమ్యను అనలేదు. ఎంతో ప్రేమగా ఉన్నారు.

అత్తగారు వేడి వేడి కాఫీ పట్టుకొచ్చి బలవంతంగా రమ్యచేత తాగించింది.

ఈ లోపుగా శ్రీకాంత్ డాక్టర్ని తీసుకువచ్చాడు. డాక్టర్ పరీక్షచేసి ఫ్యాక్చరుకాలేదు కాలు బెణికింది" అంతే అన్నాడు. కాలుకు కట్టు కట్టాడు. బాధలేకుండా మందులురాసిచ్చి వెళ్లిపోయాడు. నాలుగు రోజులు మాత్రం కదలకూడదన్నాడు. రమ్య మంచంమీదే ఉండవలసి వచ్చింది. రమ్య బాధకంటే అవమానంతో ఉంది.

నీరజ బతిమాలి వద్దంటున్నా అన్నం పట్టుకొచ్చి పెట్టింది.

"అమ్మా! రమ్యా! ఎలా ఉన్నావమ్మా!" ప్రేమగా అత్తగారు పలకరిస్తూనే ఉంది.

"అమ్మాయిగారు స్నానం చేయించనా అంటూ పనిమనిషి రంగి ఎంతో ప్రేమగా పలకరించి స్నానం చేయించి బట్టలు వేస్తోంది. శ్రీకాంత్ కూడా ఎంతో

ప్రేమగా మంచం దగ్గర కుర్చీ వేసుకుని కూర్చుంటున్నాడు. నవ్వించడానికి ఏవో కబుర్లు చెబుతున్నాడు. వారి ఆప్యాయత, ఆదరణతో రమ్య పూర్తిగా మారిపోయింది.

తల్లి బొంబాయిలో తనని, చెల్లెల్ని ఆయాకు అప్పచెప్పి ఎప్పుడూ క్లబ్బులకి వెళ్ళిపోయేది. తండ్రి ఎప్పుడూ క్యాంపుల్లోనే ఉండేవాడు. ఏ రోజూ స్కూలు నుంచి వచ్చే వేళకి ఇంట్లో ఉండేది కాదు. అంతా ఆయానే. అత్యాధునికమైన డ్రస్సులతో, ఫ్రెండ్సుతో పార్టీలతో కాలక్షేపం చేసేది తల్లి. అదే రమ్యకి, చెల్లెలు సౌమ్యకి అలవాటయింది. ఎప్పుడూ తల్లి ప్రేమగా స్నానం చేయించి బట్టలు వెయ్యలేదు. ప్రేమగా గోరు ముద్దలు తినిపించలేదు.

ఇక్కడ 20 ఏళ్ళు దాటాక అత్త, ఆడబిడ్డల ఆదరణ తట్టుకోలేకపోతోంది. ఆఖరికి రంగి 'అమ్మాయిగారూ' అంటూ స్నానం చేయించి బట్టలు వేస్తుంటే రమ్య మనసు కరిగిపోయింది. రమ్య గుండెల్లో అడుగున దాగి ఉన్న మమకారం వెలుగు కిరణంలా వెలికి వచ్చింది.

"తాను ఇంతకాలం మూర్ఖత్వంతో, మొండితనంతో ఎంతమందిని సూటిపోటి మాటలతో అవమాన పరిచిందో?" తలచుకొని పశ్చాత్తాపంతో బాధపడింది రమ్య. భర్త వొడిలో వాలి క్షమించమని వేడుకుంది. శ్రీకాంత్ ఆశ్చర్యపోయాడు. ఆమెలో వచ్చిన మార్పుకి ఆనంద పడ్డాడు.

"ఈ మాటలు నాకు కాదు! మా అమ్మకి, నీరజకి చెప్పు" అని ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు అంతలో అటుగా వచ్చిన అత్తగారికి నమస్కరించింది. తన చిన్నతనంలో తల్లి సంగతి అంతా చెప్పింది.

"పోనీలే అమ్మా! ఆ రోజులు మరిచిపో!" అంటూ కోడలి తల నిమిరింది.

అక్కడే ఉన్న నీరజను దగ్గరగా తీసుకుంది రమ్య.

"ఈ వదినను క్షమిస్తావా?" అంది ప్రేమగా అలా అంటుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నువ్వలా అనకూడదు? మా వదిన మంచి వదిన" నీరజ వదిన గారి బుగ్గ మీద ముద్దు పెట్టుకుని తుర్రు పిట్టలా అక్కడి నుండి పారిపోయింది.

ఆ రోజు భోగి పండుగ. ఊరంతా పేరంటాళ్ళ పిలుపులే. ముంగిట్లో గొబ్బెమ్మల కొలువులు. వాకిట్లో బొమ్మల కొలువులు. పిల్లలకు భోగి పళ్ళ హడావిడి.

రమ్య పట్టు చీరలో అత్తగారు పెట్టిన నగలతో కలకలలాడుతోంది. అన్నిట తానై తిరుగుతోంది. అందరి దృష్టి రమ్య మీదే ఉంది.

"పుట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టి మనుష్యులు మంచి చెడుల మధ్యలో కొట్టు మిట్టాడుతారు. రమ్య ఇక్కడికి రావడం మంచి పనయింది. పూర్తిగా లోకాన్ని అర్థంచేసుకుంది. ఇంక ఏ ఒడుదుడుకులు ఆమెలో ఉండవు!" అనుకుని తృప్తి పడ్డాడు శ్రీకాంత్.

"నాకు ఈ ప్రేమాభిమానాలు అందుకుని ఆనందించే అవకాశం ఈ గొబ్బెమ్మల వల్లే!" చేతులెత్తి నమస్కరించింది రమ్య.

"ముంగిట్లో గొబ్బెమ్మలు అందం, ఇంటికి కోడలు అందం" అనుకుని మురిసిపోయింది శ్రీకాంత్ తల్లి. వదినగారిని చూసి మురిసిపోయింది నీరజ.

*సెప్టెంబర్ 2004. సుజన రంజని.*

*సిలికానాంధ్ర U.S.A. ప్రచురణ.*